క్లుప్తంగా

ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి



పాతకొత్తచెరువులో ప్రచారం నిర్వహిస్తున్న నైరుతీరెడ్డి, నిషితారెడ్డి

గుంతకల్లు రూరల్: సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతీరెడ్డి, నిషితారెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని పాత కొత్తచెరువు గ్రామంలో వారు ప్రచారం చేశారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రజల మేలు కోరే జగనన్న లాంటి ముఖ్యమంత్రి దొరకడం మన అదృష్టమని, అలాంటి వ్యక్తిని ప్రజలు మరోసారి గెలిపించాలని కోరారు. ఎంపీపీ బీవీ మాధవి, వైస్ ఎంపీపీ చింబిలి ప్రభావతి, సర్పంచ్ మల్లికార్జున, ఎంపీటీసీ వెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి ఓటు వేయండి



చిట్టూరులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

పెద్దవడుగూరు: ప్రజలకు సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కుమారుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని చిట్టూరు, గంజిగుంటపల్లి, పి.కొట్టాలపల్లిలో ఆయన ప్రచారం నిర్వహించారు. మరొకసారి వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పెద్దారెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే..



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

యాడికి: మరోసారి రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీనే అధికారంలోకి వస్తుందని, టీడీపీ అధినేత చంద్రబాబు హామీలను ప్రజలెవ్వరూ నమ్మరని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బోయరెడ్డి పల్లె, కుందనకోట, చింతలాయపల్లె గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. 2014 ఎన్నికల్లో పొదుపు సంఘాలు, రైతు రుణాలను మాఫీ చేస్తామని చంద్రబాబు అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా చింతలాయపల్లెలో కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి సమక్షంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మిద్దె పెద్దపుల్లన్న, మిద్దె భాస్కర్, మిద్దె విజయుడు వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెన్నప్ప, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, నాయకులు భోగతి బ్రహ్మానందరెడ్డి, శివరామిరెడ్డి, రామకృష్ణ, మారుతి, ఓబులేసు, సంజీవరెడ్డి, వెంకటరామిరెడ్డి, దండురాముడు, వాసు, శివారెడ్డి, బీసీ మల్లికార్జున, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేతిరెడ్డి పెద్దారెడ్డిని గెలిపించుకుందాం

యాడికి: కేతిరెడ్డి పెద్దారెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకులు తలారి నాగేష్, వేలూరు జగదీస్ చౌదరి కోరారు. శుక్రవారం మండలంలోని రాయలచెరువు గ్రామంలో రెండోరోజు స్టేట్ బ్యాంకు వీధి, కొత్త కొట్టాల కాలనీల్లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందించి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచు ప్రవీణ్‌కుమార్ యాదవ్, రంగ నాయకులు రెడ్డి, మలికార్జున, రవికాంత్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించండి



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుత్తి: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని పార్టీ పట్టణ కన్వీనర్ పీరా, సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి, బళ్లారి రాజ్‌కుమార్‌రెడ్డిలు విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని చంద్రప్రియ నగర్‌లో శుక్రవారం వారు ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని భ్యర్థించారు. జగన్‌ను మరోసారి సీఎం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వరదరాజులు, నాయకులు మైనుద్దీన్, మధుసూదన్ రెడ్డి, గద్దల మస్తాన్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్‌కు ఓటు వేసి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి





ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు పైలా, ఆలూరు సాంబశివారెడ్డి

యల్లనూరు: అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు మీ వీరాకు ఒక్క చాన్స్ ఇవ్వండి.....మీ ఆశీర్వాదాలే నాకు ఆశీస్సులు, వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని కల్లూరు, దుగ్గుపల్లి, వెంకటాంపల్లి, వెన్నపూసపల్లి, పాతపల్లి, జంగంపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన లబ్ధిని వివరించారు. వలంటీర్ వ్యవస్థ, గ్రామ స్వరాజ్య పరిపాలన, ఆర్బీకేలు, రైతు భరోసా, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, మన బడి–నాడు నేడు తదితర వంటి సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కూటమిలు కట్టినా, ఎంత మంది కలిసి వచ్చినా మళ్లీ రాష్ట్రంలో జగన్‌దే హవా అని, శింగనమలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాదే గెలుపన్నారు. ప్రతి గ్రామంలో వారికు డప్పు వాయిద్యాలు, పూలమాలలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ 2014 నుంచి ఐదేళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు ప్రజలకు ఏమి మేలు చేశాడో చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. మళ్లీ అధికారంలోకి వస్తే జన్మభూమి కమిటీలు తెస్తామని చెప్పగలరా అని నిలదీశారు. ఈ దమ్ములేక సీఎం జగనన్న ఏర్పాటు చేసిన ఉత్తమమైన వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామంటున్నారన్నారు. ఇది చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ దిగజారుడు రాజకీయన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సీఎం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, సూరి, సందిప్‌రాయల్, నాగార్జునరెడ్డి, తిరుపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల సందర్భంగా భారీ బందోబస్తు

తాడిపత్రి అర్బన్: నామినేషన్ల సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. డీఎస్పీ గంగయ్య నేతృత్వంలో నలుగురు సీఐలు, నలుగురులు ఎస్ఐలతో కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించారు. ఎన్నికల నియామవళి ప్రకారం నామినేషన్ కేంద్రానికి వంద మీటర్ల వరకు పోలీసులు ఎవరినీ అనుమతించలేదు.

న్యాయవాదులు, పోలీసులకు వాగ్వాదం

శుక్రవారం నామినేషన్ సందర్భంగా న్యాయవాదులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సాధారణంగా ఎన్నికల నియామవళి ప్రకారం నామినేషన్ కేంద్రానికి వంద మీటర్ల వరకు పోలీసులు ఆంక్షలు విధించారు. కానీ పోలీసులు స్థానిక కోర్టు ముందు కూడా బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో పని నిమిత్తం కోర్టులో పలికి వెళ్లే న్యాయవాదులు, కక్షిదారులకు శుక్రవారం నాటి పరిస్థితులు ఇబ్బందికరంగా మారాయి. దీంతో న్యాయవాదులు శ్రీనివాసులు, రాజగోపాల్ తదితరులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ విషయమై జిల్లా జడ్జికి ఫిర్యాదు చేస్తామన్నారు. దీంతో అర్బన్ సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల నియామవళి ప్రకారం ఎవరికీ మినహాయింపు ఉండదన్నారు.

గుమ్మనూరుకు ఓటేస్తే గల్లీకో బెల్ట్‌షాపు



32వ వార్డులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవీఆర్



ఎమ్మెల్యే వైవీఆర్ సమక్షంలో పార్టీలో చేరిన తెలుగు యువత నాయకులు

- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: టీడీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలూరుకు చెందిన గుమ్మనూరు జయరామ్‌కు ఓటేస్తే గల్లీకో బెల్ట్‌షాపు, వార్డుకో పేకాట క్లబ్‌ను ఏర్పాటు చేయడం ఖాయమని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం 32వ వార్డు ఏకలవ్యనగర్‌లో వార్డు ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వైవీఆర్ మాట్లాడుతూ ఆలూరును మొత్తంగా ఊడ్చేసిన జయరామ్ కన్ను ఇప్పుడు ప్రశాంతంగా ఉన్న గుంతకల్లుపై పడిందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి దౌర్జన్యపరులకు ఓటు అనే అయుధంతో గట్టిగా బుద్ధిచెప్పాలన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ, సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాని ఆయన కోరారు. ఎంపీగా శంకర్‌నారాయణ, ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

మీ కౌన్సిలర్ 10 లక్షలకు అమ్ముడుపోయాడు

వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుపై గెలిచిన స్థానికేతరుడైన ఈ వార్డు కౌన్సిలర్ టీడీపీ నాయకులకు రూ.10 లక్షలకు అమ్ముడుపోయి కన్నతల్లి లాంటి పార్టీకి ద్రోహం చేశాడని ఎమ్మెల్యే వైవీఆర్ మండిపడ్డారు. కమీషన్లకు కక్కుర్తిపడే ఇలాంటి కౌన్సిలర్ వల్ల వార్డు అభివృద్ధికి అనేక పనులు మంజూరైనప్పటికీ.. ఆ పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకురాలేదన్నారు. ఈ వార్డుకు మంజూరైన పనులన్నీ త్వరలోనే పూర్తిచేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. డబ్బుకు అమ్ముడుపోయిన ఇలాంటి వ్యక్తికి తగిన బుద్ధిచెప్పాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, మాజీ వైస్ చైర్మన్ గోపా జగదీష్, 32వ వార్డు నాయకులు అంజి, ఖాజావలి, దేవేంద్రనాయక్, రామాంజి, డిష్ మాబు, కేశవ, సుబ్బారావు, కౌన్సిలర్లు నగేష్, సుమోబాషా, చాంద్‌బాషా, మాజీ కౌన్సిలర్ రంగన్న, వార్డు పెద్దలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి తెలుగు యువత నాయకులు

గుంతకల్లుటౌన్: వైఎస్సార్‌సీపీ యువనాయకుడు అబ్దుల్‌బాసిద్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన తెలుగు యువత, జనసేన నాయకులు 80 మంది వైఎస్సార్‌సీపీలోకి చేరారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తెలుగుయువత నాయకులు బాబు, ఆనంద్, గౌస్, రియాజ్, ఖలీల్, వేదవ్యాస్, అరవింద్, సాధిక్, యతీష్, నవీన్, అజయ్, సంజయ్, రషీద్, అబ్బాస్, ఇబ్రహీమ్, జాకీర్, షమీర్ తదితరులకు ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, పార్టీ సీనియర్ నాయకులు సందీప్‌రెడ్డి, బట్నాపాడు సుంకప్ప, బావన్న, దశరథరెడ్డి, శివ పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు చేసిన వైవీఆర్



నామినేషన్ వేసేందుకు వచ్చిన వైవీఆర్

గుంతకల్లు: వైఎస్సార్‌సీపీ గుంతకల్లు అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా యల్లారెడ్డి గారి వెంకటరామిరెడ్డి (వైవీఆర్) శుక్రవారం ఒక సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 1.10 గంటల సమయంలో అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డితోపాటు వైఎస్సార్ యువజన విభాగం నాయకుడు సందీప్‌రెడ్డి, సీనియర్ నాయకుడు దశరథరెడ్డి, లాయర్ వై.అశ్వర్థనారాయణరెడ్డి కసాపురం రోడ్డులోని రిటర్నింగ్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం నామినేషన్ ప్రతాలను రిటర్నింగ్ అధికారి వాకా శ్రీనివాసులురెడ్డికి వైవీఆర్ అందజేశారు. ఆయనను వైఎస్సార్‌సీపీ నాయకుడు బోయ వెంకటేశులు ప్రతిపాదించారు. అంతకుముందు వైవీఆర్ కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం, పట్టణంలోని వాసవీ దేవాలయంలో ప్రత్యేక పూజాలు నిర్వహించారు. ఇదిలా ఉండగా ఈ నెల 25న గురువారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో మరోసారి నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు వైవీఆర్ తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి భారీ ఎత్తున పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

తాడిపత్రిలో రెండు నామినేషన్లు

తాడిపత్రి: 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తరఫున జేసీ అస్మిత్‌రెడ్డి శుక్రవారం నామినేషన్ వేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాంభూపాల్‌రెడ్డికి ఆయన నామినేషన్ పత్రాలను అందజేశారు. అలాగే ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ తరఫున తాడిపత్రి ఎమ్మెల్యే అభ్యర్థిగా నల్లాని రమేష్ నాయుడు తన నామినేషన్‌ను ఆర్‌ఓకు అందజేశారు.

శింగనమల అసెంబ్లీకి రెండు నామినేషన్లు

శింగనమల: శింగనమల అసెంబ్లీకి శుక్రవారం ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెన్నెల శ్రీను తెలిపారు. అనంతపురానికి చెందిన యాట వెంకట సుబ్బయ్య (తెలుగు రాజ్యాధికార సమితి), కప్పల నాగరాజు (ఆలిండియా కిసాన్ జనతా పార్టీ) నామినేషన్లు వేశారన్నారు.

వైవీఆర్ ఆస్తులు రూ.3.50 కోట్లు

గుంతకల్లు: గుంతకల్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వై.వెంకటరామిరెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆఫిడఫిట్‌లో తను, తన భార్య శారదమ్మ పేరుతో ఉన్న స్థిర, చర ఆస్తులు, అప్పులు, ఆదాయ మార్గాలకు సంబంధించిన వివరాలు వెల్లండించారు. ఆ వివరాల ప్రకారం..

- యల్లారెడ్డి గారి వెంకటరామిరెడ్డి, ఆయన సతీమణి శారదమ్మ పేరిట గృహాలు, వ్యవసాయ భూములు, ఎల్‌సీ పాలసీలు, షేర్లు, బంగారం, వెండి అభరణాలు, వాహనాలు చరాస్తులు మొత్తం కలిపి రూ.3.50 కోట్లు, అప్పు రూ.1.20 కోట్లు

బ్యాంకు ఖాతాలు

- గుంతకల్లులోని యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్, బజార్ బ్రాంచ్, యూనియన్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల్లో వైవీఆర్‌కు ఖాతాలు ఉండగా, భార్య శారదమ్మకు యాక్సిస్ బ్యాంకులో ఖాతా ఉంది.
- వైవీఆర్ దగ్గర బంగారం 500 గ్రాములు, శారదమ్మకు 850 గ్రాములు
- టాయోటా ఫార్చునర్ వాహనాలు 2
- ప్రత్యేక హోదా, సమైక్య ఆంధ్ర ఉద్యమంలో నమోదైన కేసులు వివరాలను అఫిడిఫెట్‌లో కనబరిచారు.

వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించండి



ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుత్తి: మరోసారి వైఎస్సార్ సీపీని ఆదరించాలని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆర్యవైశ్యులకు పిలుపునిచ్చారు. ముందుగా ఎమ్మెల్యే వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఫంక్షన్ హాల్లో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. ఆర్యవైశ్యులు చాలా శాంతి కాములన్నారు. మాట ఇస్తే తప్పరన్నారు. గుంతకల్లు నియోజకవర్గం ప్రశాంతతకు మారుపేరన్నారు. ఆ ప్రశాంతతను భంగ పరచడానికి ఆలూరు నుంచి టీడీపీ గుమ్మనూరు జయరాం అనే దౌర్జన్య పరున్ని తెచ్చుకుందన్నారు. ఆయనకు ఓటు వేస్తే ప్రశాంతత కు భంగం కలుగుతుందన్నారు. గుంతకల్లు నియోజకవర్గం ప్రశాంతంగా ఉండాలంటే వైఎస్సార్ సీపీని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గోపా జగదీష్, సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిషోర్ బాబు, తాయి వెంకటేష్, టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షుడు రాము, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పీరా, మాజీ ఎంపీపీ కోనా మురళి ధర్‌రెడ్డి, పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు రంగస్వామి, సుభాష్ రెడ్డి, విజయ భాస్కర్, మైనార్టీ జిల్లా నాయకులు కటిక అన్వర్, వరదరాజులు, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి బేడల వెంకటరాముడు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పెద్దపప్పూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పెద్దపప్పూరు మండలంలోని జూటూరు, తిమ్మనచెరువు, చింతరపల్లి, చిన్నపప్పూరు, తబ్జుల, శింగనగుట్టపల్లి, చాగల్లు, పెద్దపప్పూరు గ్రామాల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పర్యటించనున్నట్లు శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. మండల నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

శుభకార్యం

పెద్దపప్పూరు: మండలంలోని చాగల్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తలారి నాగేష్ కుమార్తె శైలజ, వేణుగోపాల్ వివాహం శుక్రవారం అశ్వర్థనారాయణస్వామి క్షేత్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగింది. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మండల నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

నేడు వీరాంజనేయులు నామినేషన్

శింగనమల: శింగనమల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు శనివారం ఉదయం 11 గంటలకు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి శుక్రవారం తెలిపారు. పార్టీ శ్రేణులు, కుటుంబసభ్యులందరి సమక్షంలో భారీ జన సందోహం మధ్య ఈ నెల 24న వీరాంజనేయులు రెండో సెట్ నామినేషన్ దాఖలు చేస్తారన్నారు.

నేడు వీరా ప్రచారం

శింగనమల: మండలంలోని చిన్నమట్లగొంది, పెద్దమట్లగొంది, ఈస్ట్ నరసాపురం, సోదనపల్లి గ్రామాల్లో శనివారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలకృష్ణ తెలిపారు. ఆయా గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి సంక్షేమ పథకాలను వివరిస్తారనాన్రు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వలంటీర్ల రాజీనామా

నార్పల: మండలవ్యాప్తంగా పలు గ్రామ సచివాలయాల్లో వలంటీర్లుగా విధులు నిర్వహిస్తున్న 72 మంది శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ రాముడుకు అందజేశారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడానికి రాజీనామా చేస్తున్నట్లు వారు తెలిపారు. వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చేసిన ఆరోపణలు మనస్థాపం కల్గించాయన్నారు.

బుక్కరాయసముద్రం: మండలంలోని బొమ్మలాటపల్లి, రోటరీపురం, వడియంపేట గ్రామాల్లో 50 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ శోభారాణికి అందజేశారు. అనంతరం వలంటీర్లు మాట్లాడుతూ నిష్పక్షపాతంగా నిరుపేదల కోసం పని చేస్తుంటే టీడీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు దీంతో రాజీనామా చేసి మరోసారి సీఎం వైఎస్ జనన్న గెలుపు కోసం పని చేస్తామన్నారు.

యల్లనూరు: మండలంలో 18 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ వీరరాజు తెలిపారు. రాజీనామా చేసిన వారిలో చిలమకూరు–1, యల్లనూరు–1 సచివాలయంలో ఆరుగురు, యల్లనూరు–2లో నలుగురు, వెన్నపూసపల్లిలో ఏడుగురు వలంటీర్లు రాజీనామా చేశారన్నారు. వలంటీర్లు మాట్లాడుతూ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడానికి రాజీనామా చేశామన్నారు.

సీఎం జగనన్నతోనే రాజన్న రాజ్యం



ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీబీ మంజునాథ్‌రెడ్డి

పామిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాజన్న రాజ్యం సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీబీ మంజునాథ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక 5, 6, 7 వార్డుల్లో వారు మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి ముమ్మరం ప్రచారం చేపట్టారు. స్థానిక కరెంటు ఆఫీసు కాలనీ, సరస్వతీ విద్యామందిరం కాలనీ, మదీనా కాలనీ, గుండప్పరావు కాలనీ, గుప్తాకాలనీ, సీపీఐ కాలనీ, నాగిరెడ్డి కాలనీలో వారు ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గుంతకల్లు ఎమ్మెల్యేగా వై. వెంకట్రామిరెడ్డి, ఎంపీగా శంకర్‌నారాయణను గెలిపించాలంటూ అభ్యర్థించారు. సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ సీబీ జానకిరామిరెడ్డి, పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కే నారాయణరెడ్డి. కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, బీసీ సెల్ పట్టణ కన్వీనర్ చీమల నగేష్, బోయ రామచంద్ర, అనుంపల్లి సూరి, అబ్దుల్ రజాక్, సునీల్‌రెడ్డి, పార్వతీశ్వర్‌రెడ్డి, ఫర్యాద్, గౌస్, వెంకటగుప్తా, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంహెచ్ అనిల్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శివ, రంగనాయకులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'బుగ్గన'కు స్వాగతం



బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని కలసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

గుత్తి: గుత్తిలోని స్పందన ఫంక్షన్ హాల్లో శుక్రవారం జరిగిన ఓ శుభకార్యానికి రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి వచ్చారు. మాజీ ఎంపీపీ కోనా మురళీధర్ రెడ్డి, జిల్లా నాయకులు మధుసూదన్ రెడ్డి, చౌదరి విజయభాస్కర్, కోనా నిషాంత్ రెడ్డి తదితరులు బుగ్గనకు స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించారు.

సంక్షిప్త వార్తలు

ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలి

పామిడి: ప్రతి ఒక్కరూ ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎ. శ్రీనివాసరావు, సీఐ ఎం.రాజశేఖర్‌రెడ్డి, ఈఓఆర్డీ బీవీ శశికళ, రీసర్వే డీటీ షెక్షావలి సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి పెన్నానది పంప్‌హౌస్ వరకూ ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద వారు మానవహారంగా ఏర్పడి ఓటుహక్కు ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

పామిడి: హైదరాబాద్‌లో ఈనెల 25న జరిగే జాతీయ స్థాయి క్రికెట్, కబడ్డీ పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. గత మార్చిలో అనంతపురం పీటీసీ గ్రౌండ్‌లో స్కూల్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఆక్టివిటీస్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అండర్–14, 16 విభాగాలకు సంబంధించి క్రికెట్, కబడ్డీ పోటీల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్–14 విభాగంలోని కబడ్డీ పోటీలకు ఓంనాథ్, కార్తీక్‌రెడ్డి, అండర్–16 విభాగం క్రికెట్ పోటీలకు మహమ్మద్ షారూక్, గౌస్‌పీర్ ఎంపికయ్యారు. వారి ఎంపికకు సహకరించిన పీఈటీ హనుమేష్‌తో పాటు క్రీడాకారులను చైతన్య స్కూల్ సీఈఓ సంతోష్‌రెడ్డి, డైరెక్టర్ రమణారెడ్డి శుక్రవారం అభినందించారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష రేపు

యాడికి: మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి ఈ నెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మారుతి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.

'టీడీపీ నాయకులను శిక్షించాలి'

గుంతకల్లు: కళ్యాణదుర్గం మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ నాగలక్ష్మి భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు హరిపై దాడి చేసిన టీడీపీ నాయకులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని గుంతకల్లు నియోజకవర్గ బీసీ యువజన నాయకుడు బీకే శివప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తలారి రంగయ్యకు మద్దతుగా ప్రచారం చేస్తున్న సమయంలో టీడీపీ నాయకులు ప్రచార రథం (వాహనం) తాళాలు బలవంతంగా తీసుకొని అడ్డు వచ్చిన హరిపై దాడి చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలకు పాల్పడం ద్వారా శాంతయుతంగా జరిగాల్సిన ఎన్నికలకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠనంగా శిక్షించాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

యల్లనూరు: మండలంలోని కల్లూరులో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ గిరిబాబు వివరాల మేరకు.. రైతు శివారెడ్డి(73) వ్యవసాయంలో చేసిన అప్పులను తీర్చలేక దిక్కుతోచని స్థితిలో విషపు గుళికలు మింగాడు. అపస్మాకర స్థితిలో ఉన్న అతడిని కుటుంబీకులు పులివెందుల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అతడి భార్య సోమేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జి.ఎర్రగుడి గ్రామంలో శుక్రవారం మహాలక్ష్మి అనే మహిళ కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మహేష్, మహాలక్ష్మి దంపతులు చిన్నపాటి విషయంపై గొడవ పడ్డారు. మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఉన్న కిరోసిన్ ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మంటల్లో చిక్కుకున్న ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన భర్త మహేష్‌కు మంటలు వ్యాపించాయి. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ బంధువులు గుత్తి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా వారిని మెరుగైన అనంతపురం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని ఎంగిలిబండ గ్రామ శివారులో శుక్రవారం ఆటో బోల్తాపడి ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. తాడిపత్రి పట్టణంలోని బిందెల కాలనీకి చెందిన నాగేంద్ర, సుభద్ర, ప్రసన్న గుంతకల్లు పట్టణంలో జరిగిన బంధువుల వివాహ వేడుకకు వెళ్లారు. అనంతరం తాడిపత్రికి వెళ్తుండగా ఎంగిలిబండ గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో గాయపడిన వారిని 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ బోల్తా.. వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో శుక్రవారం ఓ ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో రాముడు అనే వ్యక్తి గాయపడ్డాడు. ఆర్ఎస్‌లోని తోళ్లషాపు కాలనీకి చెందిన రాముడు బైక్‌లో బస్టాండ్ వైపు వెళ్తుతుండగా ఆటో ఎదురుగా వచ్చింది. ఆటోను తప్పించబోయి బైక్ బోల్తా పడింది. గాయపడిన అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

నామినేషన్ల పరిశీలన

శింగనమల: శింగనమల నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్లను శుక్రవారం ఎన్నికల వ్యయ పరిశీలకుడు కాలే రాందాస్‌లు పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెన్నెల శ్రీనుతో నామినేషన్ల గురించి అడిగి తెలుసుకున్నారు. వాటికి సంబంధించి వ్యయ వివరాల గురించి ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు.